# ఇన్‌ఫ్లేషన్ ఇంజక్షన్ పుచ్చుకుంది !

చీకటి దేశం ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తోంది....!

ప్రజలు అభివృద్ధి చెందితేనే కదా దేశం వెలుగులోకి వచ్చేది?...కాబట్టి ఆ దేశంలో ప్రజలు 'సంఖ్య'లో బాగా 'వృద్ధి' చెందడమే అభిప్రాయంగా ఉన్నారని చెప్పుకోవాలి...

వాళ్ళల్లో పొలిటీషియన్లు ఎక్కువవుతున్నారు.... కనకనే ఎన్నికల్లో ఒక్కొక్క సీటుకి వందమంది చొప్పున నామినేషన్లు వేస్తున్నారు....వాళ్ళల్లో రచయితలు ఎక్కువవుతున్నారు... కనుకనే పరాయిగోడలమీద, సొంతడబ్బుతో వెల్లవేయించి రచనలు చేస్తున్నారు... వాళ్ళలో విద్యార్థులు ఎక్కువవుతున్నారు.. కనుకనే వాళ్ళంతా 'కాపీ' కొట్టే స్థాయినుంచి 'మందు' కొట్టే స్థాయికి ఎదుగుతున్నారు....

ఏడాదికి ఒకటి రెండుసార్లు 'కుల మతాల కుమ్ములాటలు' పేరున ప్రాణాలతో ఆడుకోవటం మినహాయిస్తే ఆ దేశంలో ప్రజలంతా కలిసిమెలిసి జీవిస్తారు.

అన్నట్లు ఆ దేశంలో ఓ ప్రభుత్వం కూడావుంది...వుందనటానికి నిదర్శనంగా ప్రతి పండక్కీ పబ్బానికీ ప్రజాసంక్షేమంకోసం ఓ పథకం ప్రారంభించబడుతుంది... ఆ పథకాన్ని విజయవంతంగా అమలుపరిచేలా చూసేందుకు ఎన్నో శాఖల్ని ఏర్పాటు చేసింది...

అలాంటి శాఖల్లో రోడ్డురవాణాశాఖ కూడా ఒకటి....!

"ప్రయాణీకులకు సేవ చేయటం మా లక్ష్యం" అని బోర్డుకట్టుకుంది ఆశాఖ.. అందుకే ఆ శాఖవారు నడిపే బస్సుల్లోని కండక్టర్లు ప్రయాణీకుల పట్ల కడు ఔదార్యాన్ని ప్రదర్శిస్తుంటారు...రూపాయి టిక్కెట్టుకి అర్ధరూపాయే తీసుకుని ప్రయాణీకుల్ని గమ్యానికి చేరుస్తారు... టిక్కెట్టు ఇవ్వకపోతే ఇవ్వకపోయారు.... అది వేరే విషయం ! ఆ శాఖ వారు దేశం లోని మారుమూల పల్లెలకు కూడా బస్సు సౌకర్యాన్ని కల్పించారు. కొంత కాలం ఓపికపడితే వీధివీధికీ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని శపథం చేశారు......... పట్టణాలకూ, నగరాలకూ ప్రయాణం చేసేవారు వందలూ వేలూ వుంటారు... మారుమూల పల్లెలకు వెళ్ళేవారు పదిమందే వుండవచ్చు... అయినాసరే 'అందరూ మాకొక్కటే.

అందరిపట్లా మా ప్రేమ ఒక్కటే' అని ఎలుగెత్తి చాటారు...

అయితే దురదృష్టవశాత్తూ అంతగా ప్రజల్ని ప్రేమిస్తున్న ఆ శాఖ పట్లా, అది నడిపే బస్సులపట్లా, అక్కడి ప్రజలకి గౌరవం కొంచెమైనా వున్నట్లు గోచరించదు.

పొరపాటునో, గ్రహపాటునో, 'మందు' పాటునో ఆ శాఖ తాలూకు బస్సు ఏ మనిషినైనా గుద్దేసి చంపేస్తే అక్కడి ప్రజలంతా ఆ బస్సును అక్కడికక్కడే తగలబెట్టేసి చనిపోయిన మనిషి ఆత్మకి శాంతి కలిగిస్తారు.

అయినాసరే మనుషుల్ని అప్పుడప్పుడూ అక్కడక్కడా బస్సులు గుద్దుతూనే వుంటాయి. అది వాటి ధర్మం... జనం అక్కడికక్కడో ఆస్పత్రిలోనో దారిమధ్యలోనో పోయే వాళ్ళు పోతూనే వుంటారు..అది వాళ్ళ ఖర్మం.

"బస్సూ బస్సూ ! ఎందుకు గుద్దేవమ్మా ?" అని అడిగితే-

"నేనేం చేసేదీ? ట్రాఫిక్ కంట్రోల్ అలా వుంది" అని జవాబిస్తుంది !

"ట్రాఫిక్కూ! ట్రాఫిక్కూ! ఎందుకలావున్నావ్ ?" అని అడిగితే-

"నేనేం చెయ్యను ? మీ జనాభా దారుణంగా పెరిగిపోతోంది" అంటుంది.

"జనాభా జనాభా...ఇహ నువ్ తగ్గేది లేదా ?" అని అడిగితే-

"బస్సులు మరికొన్ని పెరిగితే..." అంటుంది....!

అదంతా ఒక విషవలయం...వదిలేద్దాం. ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే సదరు రవాణా శాఖకి నష్టం వచ్చింది... అదీ అసలు విషయం.

"ఎందుకొచ్చిందీ?" అని అడిగితే మళ్ళీ 'రాజుగారూ ఏడు చేపల కథ' లాంటిది చెప్పాలి...

సరే...వచ్చింది...!

ఆ శాఖలోని అధికారులూ, అనధికారులూ అందరూ ఓ రోజు సాయంత్రం కలుసుకున్నారు.

హఠాత్తుగా ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. వానకూడా 'వస్తా' నని బెదిరించింది.

"ఏమిటీ దారుణం ?..ఇంతలోనే వాతావరణం ఇలా మారిపోవటానికి ఏమిటి కారణం" ? అన్నాడు ఓ అధికారి.

"ఇదేమీ దారుణం కాదు... దీనికి కారణం మనం అందరం ఒకేసారి కలుసుకోవటం.

ఆ ఆనందంలో ప్రకృతికి కలిగిన పరవశం...ఇప్పుడు మనం మందుకొట్టాలి'' కష్టమొచ్చినా సుఖమొచ్చినా తట్టుకునేందుకు మందొక్కటే మార్గమని విశ్వసించే విశ్వేశ్వర్రావ్‌గారు అనధికార హోదాలో సలహా ఇచ్చారు.

ఆ సలహా అందరికీ నచ్చింది.

"చాలా ముఖ్యమైన విషయాన్ని చర్చించాలని మనమంతా సమావేశమయ్యాం... అది మర్చిపోయి మందుకొడుతూ కూచుంటే మనల్ని ఆ భగవంతుడూ ప్రజలూ మన్నించరు'' మందు పుచ్చుకోవాలని కొండంత కోరిక మనస్సులో వున్నా పైకి కొంచెం బెట్టు చూపుతూ అన్నాడు మరో అధికారోత్తముడు....తన తీర్మానం పిచ్చిగా వీగిపోతుందని అతనికీ తెలుసు.....అయినా తన ప్రత్యేకతను చూపించుకోవాలనే 'చిరుసరదా' అతనిచేత సదరు తీర్మానం చేయించింది.

అయితే అనధికారిగారు ఊరుకోలేదు...ఊరుకోవటం తన ధర్మం కాదనీ ఆయనకి తెలుసు.

"వర్షం వచ్చినపుడే మెరుపు మెరుస్తుంది. మందుకొట్టినప్పుడే ఆలోచన వస్తుంది. పైకి నీళ్ళలాగా కనిపించే 'మందు' కూడా వర్షంలాగా రుచిగావుంటుంది....మత్తుగా వున్నా, ఆలోచన మాత్రం మెరుపులా చురుగ్గా వుంటుంది''- రెండు మూడుసార్లు కవిసమ్మేళనాలకు కూడా అధ్యక్షత వహించిన అనధికారి అందరికీ అర్థమైవుంటుందనే నమ్మకంతో కొంత ఆ ధోరణి తన మాటల్లో చొప్పించాడు.

ఆ మాటలు వినగానే బురదగుంటలో తామర పువ్వులా అధికారి వదనంలో చిరునవ్వు తొంగి చూసింది...... మరుక్షణంలో మందుపార్టీ ఆరంభమైంది.

"ఇప్పుడు అసలు విషయాని కొద్దాం'' – ఛీర్స్ చెప్పి కొంచెం పుచ్చుకొన్నాక అన్నాడు అనధికారి.

ఆ అసలు విషయాన్ని చెప్పటం ప్రారంభించాడు అధికారి.

"మన శాఖ విపరీతమైన నష్టాల్లో పడింది.... ఆమధ్య అక్కడెక్కడో ఓ పోలీసు ఓ ముసలమ్మను మానభంగం చేసేడని విద్యార్థులు దేశ వ్యాప్తంగా జరిపిన అల్లర్లూ, ఆందోళనలూ కారణంగా మనశాఖ తాలూకు అయిదు బస్సులు పూర్తిగా ధ్వంస మయ్యాయి!...... మరెన్నో బస్సులు విపరీతంగా దెబ్బతిన్నాయి......... నష్టం పదిహేను లక్షల వరకూ వుంటుందని తేలింది.... పోతే మన కండక్టర్లు పేసింజర్లతో లాలూచి

అవుతున్న కారణంగానూ, బస్సుల సంఖ్య పెంచిన కారణంగానూ, మరో నాలుగు అయిదు లక్షల లోటు ఏర్పడింది... ఈ పరిస్థితుల్లో రవాణా ఛార్జీలు పెంచవలసి వస్తోంది....మీ అందరి అభిప్రాయం కావాలి!..."

"అలాగే! బస్సు ఛార్జీలు పెంచేద్దాం!" మందు ఒంటబట్టిన సభ్యులందరూ 'మూక' కంఠంతో చెప్పారు.

మందు కొడుతున్న అందరూ కరెక్టుగానే మాట్లాడుతున్నారు. కల్లు, సారా అయితే ఏం భాష వచ్చేదో తెలీదుకానీ వాళ్ళు తీసుకుంటున్నది 'ఇంగ్లీషు మందు' కాబట్టి ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నారు......ఇంగ్లీషులో బూతులుండవని వాళ్ళందరికీ తెలుసు!... అందుకే ఇంగ్లీషు భాషను నేర్పే 'ఇంగ్లీషు మంద'ంటే వాళ్ళందరికీ చాలా ఇష్టం!

"ఎంత పెంచాలీ?" రెండు నిమిషాల తర్వాత అడిగేడు అనధికారి.

"రూపాయికి పదిపైసలు చొప్పున పెంచితే ఈ ఏడాది పూర్తయ్యేసరికి మనశాఖకి వచ్చిన నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చు!" గంట గంటకీ టీ తాగి, ఓవర్ టైములుకూడా పని చేసి గుమాస్తాలు యిచ్చిన స్టేట్ మెంట్‌లోకి చూసి చెప్పాడు అధికారి.

'రైట్! ఆల్‌రైట్'- అన్నారు సభ్యులందరూ.

"హోల్డాన్... హోల్డాన్ !" అన్నాడు అనధికారి.

అందరూ ప్రశ్నార్థకంగా అతనివైపు చూశారు.

"ఇలాంటి కమిటీల్లో మాబోటి అనధికారుల్ని ఎందుకువేస్తారో ఇప్పుడర్థమై పోయింది!..." అన్నాడాయన ఖాళీ అయిపోయిన గ్లాసులో మరికాస్త 'తీర్థం' వంపుకుంటూ.

"ఇంతకీ మీరనేదేమిటి?" ఎవరో అడిగారు.

"రూపాయికి పదిపైసలుకాదు.... ఇరవై పెంచండి !" అన్నాడాయన.

ఆ ప్రతిపాదన విని అందరూ షాకయ్యారు.

"ఇవేం విమానాలుకావు అంతంత పెంచటానికి !... పైగా "ప్రయాణీకులకు సేవ చేయటమే. మా లక్ష్యం" అని మెడలో ' మెడల్ ' లాంటి బోర్డు ఒకటి. తగిలించుకున్నాం.... అలాంటిది ఇప్పుడు ఇంత దారుణంగా ఛార్జీలు పెంచేస్తే ప్రజలు ఊరుక్కోరు ! సమ్మెలు చేస్తారు. ఆందోళనలు లేవదీస్తారు.... ఏ బస్సులో వుండే డీశెలాయిలు ఆ బస్సుమీదే పోసేసి ఆపై అగ్గిపుల్ల గీస్తారు.. ఆ విషయం మనం మరచిపోకూడదు!" అధికార వర్గంలో సభ్యుడు ఎవరో ఆవేశంగా అన్నాడు.

ఆ మాటలకు అనధికారి కోప్పడలేదు... చాలా శాంతంగా, శ్రీకృష్ణపరమాత్మలా 'ఫేస్' పెట్టి చెప్పాడు-

"ప్రజల సంగతి మీకంటే నాకు బాగా తెలుసు. నేను వాళ్ళనాడి ఎలా కొట్టుకుంటుందో తెలిసినవాణ్ణి.... వాళ్ళటెంపరేచర్ ఎప్పుడు ఎంత పెరుగుతుందో ఎరిగిన వాణ్ణి. సమ్మెలూ, సత్యాగ్రహాలు వాళ్ళ జన్మహక్కు...ఆవేశం వాళ్ళఆస్థి....ఆరంభ శూరత్వం వాళ్ళ ఆరోప్రాణం "

"అందుకనీ...?"

"మీరు పదిపైసలు పెంచినా, అయిదుపైసలు పెంచినా ఇప్పుడు నేను చెప్పిన వన్నీ చేస్తారు... అందుకే 'మందు' చూపుతో చెప్తున్నాను.... అట్లా కానివ్వండి."

ఆ మందు చూపేమిటో మందు బాగా తలకెక్కిన వాళ్ళందకీ కూడా బాగా అర్ధమైంది.

" ఆల్ రైట్" అన్నారు మళ్ళీ 'మూక' కంఠంతో.

సమావేశం ముగిసింది.

"రూపాయికి ఇరవై పైసలు చొప్పున బస్సు ఛార్జీల పెరుగుదల" --మర్నాటి పేపర్లలో అది ప్రముఖ వార్త.

ఆ వార్తే ఆ పూట ప్రతి నోటా చర్చనీయాంశమైంది.

"దారుణం " అన్నారు కొందరు.

"సామాన్యుడి బ్రతుకుపై చావుదెబ్బ" అని వ్యాఖ్యానించారు మరికొందరు.

"గోరుచుట్టుపై రోకలిపోటు" అంటూ ప్రతిపక్షాలు అలవాటు ప్రకారం విమర్శించాయి...... ఆందోళన లేవదీశాయి... అసెంబ్లీలో మైకులు విరగ్గొట్టేయి. అదీచాలక వాకౌట్ చేశాయి...

"బస్సు ఛార్జీలను యధాప్రకారంగా వుంచాలి" అని నినాదాలు ప్రారంభించారు విద్యార్థులు. ప్రజల ఆస్థిపాస్థుల్ని కాపాడవలసిన సభ్యులే సభలో మైకులు విరగొట్టినప్పుడు 'మేం మాత్రం తక్కువా' అన్నట్టుగా, కనిపించిన బస్సుమీదల్లా రాళ్ళురువ్వేరు. అఘమేఘాల మీద పోయే బస్సుల్ని ఆపి అద్దాలు పగలగొట్టేరు... టైర్లు కోశారు... వీరావేశ పరులు మరి కొందరు బస్సుల్ని తగలబెట్టాలని విశ్వ ప్రయత్నం చేశారు.

సచివాలయం దగ్గర రిలే 'నిరాహారదీక్ష' ల తాలూకు అట్ట బోర్డులు వెలిశాయి. గోడల

మీద ఖాళీ మిగల్చకుండా నినాదాలు కురిశాయి...

ఒక రోజు... రెండురోజులు....

మూడోరోజున ఆందోళన తీవ్రరూపం ధరించేసరికి ఆ దేశంలోని ప్రభుత్వం కలుగచేసుకుంది.... ఆందోళనలవల్లా, అల్లర్లవల్లా సమస్యలు పరిష్కారం కావనే మహత్తర సత్యాన్ని మరోసారి గుర్తు చేసింది.... ఉద్యమాన్ని నడుపుతున్న నాయకుల్నీ ప్రతిపక్షాల సభ్యుల్నీ రవాణా సంస్థ అధికారుల్నీ పిలిచి సంప్రదింపుల సమావేశాన్ని ఏర్పాటుచేసింది....

రవాణా సంస్థ నష్టంలో నడుస్తోంది కనుక ఇరవైపైసలు పెంచితీరాలని దాని తాలూకు అధికారులూ అనధికారులూ ఈసారి మందు కొట్టకుండానే బల్లకొట్టి మరీ చెప్పారు.

ప్రజా శ్రేయస్సుకోసం ఆ మాత్రం నష్టాన్ని భరించినా తప్పుకాదనీ అవసరమైతే ఆ నష్టం మేరకు ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేయవచ్చనీ పట్టుపట్టారు ఉద్యమవీరులు.

గంటసేపు వాద ప్రతివాదనలు జరిగేయి... చివరకు మధ్యేమార్గంగా కలిసి ఒక రాజీ కొచ్చారు....

రూపాయికి పన్నెండు పైసలు పెంచటానికి అందరూ అంగీకరించారు....

ఆందోళన ముగిసింది...

బస్సులు మళ్ళీ నడవటం ప్రారంభించాయి....

రవాణా సంస్థవారు పెంచ తలపెట్టిన ఇరవై పైసల్లో దాదాపు సగభాగం కేవలం తమ ఆందోళనవల్లనే తగ్గిపోయినందుకు ఉద్యమకారులు చాలా సంతృప్తి చెందారు.

ముందుగా పదిపైసలు మాత్రం పెంచితే చాలనుకున్న రవాణాశాఖ- ఆ మూడు రోజుల అల్లర్లలోను మరికొన్ని బస్సులకు వాటిల్లిన నష్టాన్ని కూడా భర్తీ చేసుకునేందుకు వీలుగా, మరో రెండు పైసలు ఎక్కువ పెరిగినందుకు "మీ అజ్ఞానమే మా మహాభాగ్యం" అనుకుంటూ ఎంతో సంతోషించింది. ....

ఆ తర్వాత అనధికారి' మందు' చూపుకి, ఖరీదైన మందుతోనూ, ఘనమైన విందు తోనూ కృతజ్ఞతలు తెలుపుకున్నారు అధికారసభ్యులు. ★

(హాస్యప్రియ- నవంబర్ 85)